ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలి

- సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు కమలాకర్

రుద్రంగి సమావేశంలో మాట్లాడుతున్న సెస్ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకులు

రుద్రంగి, ఆగస్టు 28: ప్రజా సేవ చేయాలనే చిత్తశుద్ధి ఉంటే ఎలాంటి నింబంధనలు లేకుండా రుణాలు తీసుకున్న ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు దయ్యాల కమలాకర్ అన్నారు. బుధవారం రుద్రంగి మండల కేంద్రంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు దయ్యాల కమలాకర్ అధ్వర్యంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, బీఆర్ఎస్ నాయకులు రైతు రుణమాఫీపై విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని గ్యారెంటీలను అమలు చేసిందో చెప్పాలన్నారు. ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటివరకు రుద్రంగిలో ఎంత మంది రైతులు రుణాలు తీసుకుంటే ఎంత మందికి రుణమాఫీ చేశారో కాంగ్రెస్ నాయకులు చెప్పాలన్నారు. మాఫీ కాని రైతులు బ్యాంకులు, రైతు వేదికల చుట్టూ తిరుగుతున్నారన్నారు. రుద్రంగి పరిధిలో దాదాపు 3వేల మంది రైతులు రుణాలు తీసుకుంటే దాదాపు 1800 మందికి రుణమాఫీ అయిందన్నారు. కాంగ్రెస్ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, చిత్తశుద్ధి ఉంటే రుణాలు తీసుకున్న ప్రతి రైతుకి రుణమాఫీ చేయాలన్నారు. వేములవాడ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఎక్కడి నుంచో వలస రాలేదని వారిది కోనారావుపేట మండలం మల్కపేట గ్రామమని గుర్తుచేశారు. రూ.15 వేలు రైతు భరోసా పోయిందని, కనీసం రుణాలు తీసుకున్న ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని స్థానిక ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో సొసైటీ చెర్మన్ ఏలేటి చిన్నారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చెర్మన్ కంటె రెడ్డి, నాయకులు గంగం మహేశ్, మాడిశెట్టి ఆనందం, మంచె రాజేశం, చెప్యాల గణేశ్, సుందర్‌నాయక్, ఉప్పులూటి గణేశ్, నాగుల పెల్లి రవి, బోయిని చంద్రయ్య, అల్లూరి గంగారెడ్డి, కా దాసు లక్ష్మణ్, నరేశ్, ఆకుల గంగాధర్, బాబా, మోహన్, రాజేశం, గంగాధర్ తదితరులున్నారు.

ఎమ్మెల్సీ కవిత విడుదల హర్షణీయం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ముస్తాబాద్, ఆగస్టు 28: ఎమ్మెల్సీ కవిత విడుదల హర్షణీయని, కేంద్ర ప్రభుత్వం ఈడీ, సీబీఐలను తమ గుప్పిట్లో పెట్టుకొని అన్యాయంగా అరెస్టు చేసిందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ మాట్లాడుతూ, కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని ఇబ్బంది పెట్టాలనే లక్ష్యంతో బీజేపీ చేసిన కుట్రలపై ధర్మం, న్యాయం గెలిచిందన్నారు. 166 రోజులు జైల్లో ఉన్నా, భయపడకుండా ఉన్న ధైర్యశాలి ఎమ్మెల్సీ కవిత అని స్పష్టం చేశారు. అక్రమ కేసులను ఛేదించి జైలు నుంచి విడుదలవడంపై హర్షం వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థపై అవగాహన లేని బీజేపీ, కాంగ్రెస్ నేతల మాటలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. ఇక్కడ యూత్ మండలాధ్యక్షుడు శీలం స్వామి, చిప్పలపల్లి మాజీ సర్పంచ్ తాడెపు ఎల్లం, నాయకులు రాజు, సతీశ్, గణేశ్, తదితరులున్నారు.

యువత గంజాయికి బానిస కావొద్దు

కోనరావుపేట, ఆగస్టు 28: యువత గంజాయికి బానిస కావొద్దని ఎస్ఐ శేఖర్‌రెడ్డి సూచించారు. మండలంలోని కొలనూర్ మార్గదర్శి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసై తమ జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం పలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇక్కడ పాఠశాల కరస్పాండెంట్ చిరంజీవి తదితరులున్నారు.

విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- బోయినపల్లి, వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్ల తనిఖీ

వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

బోయినపల్లి/వేములవాడ రూరల్, ఆగస్టు 28: గ్రామాల్లో విజిబుల్ పోలిసింగ్ అమలు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీసులను ఆదేశించారు. బుధవారం బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌ను, వేములవాడ రూరల్ సర్కిల్ కార్యాలయం, రూరల్ పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు, ఫైళ్లను తనిఖీ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించి, విచారించి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అధికారులు సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని కోరారు. నేరాల నియంత్రణకు పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని, విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాలకు సంబంధించిన పూర్తి సమాచారం వీపీవోల దగ్గర ఉండాలని, ఏవైనా సంఘటనలు జరిగితే వెంటనే ఉన్నతాధికారులకు తెలియ చేయాలని సూచించారు. బ్లూ కోర్టు సిబ్బంది డయల్ 100 కాల్ రాగానే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యలు పరిష్కరించాలన్నారు. రాత్రి వేళల్లో విధులు నిర్వర్తించే బ్లూ కోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది స్టేషన్ పరిధిలోని పాత నేరస్తులు అనుమానితులు, రౌడీ షీటర్లపై నిఘా ఉంచాలని కోరారు. ఇక్కడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు పృథ్వీధర్‌గౌడ్, మారుతి సిబ్బంది ఉన్నారు

'మోడల్ స్కూల్ విద్యార్థులకు బస్ సౌకర్యం కల్పించండి'

వేములవాడ రూరల్, ఆగస్టు 28: కరీంనగర్ జిల్లాలో మోడల్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు అరకొర బస్సులతో ఇబ్బంది పడుతున్న రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టించుకోవడం లేదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి విమర్శించారు. బుధవారం వేములవాడ పట్టణంలోని భీమేశ్వర ఫంక్షన్ హాల్‌లో వేములవాడ రూరల్ మండల బీజేపీ అధ్యక్షుడు జక్కుల తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన వేములవాడ రూరల్ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లాలో మోడల్ స్కూల్ విద్యార్థులు సరిపడా బస్సుల్లేక విద్యార్థులు పాఠశాల నుంచి రాత్రి 7 గంటలైనా ఇంటికి చేరడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు జక్కుల తిరుపతి, ప్రధాన కార్యదర్శి బూరుగుపల్లి పరమేశ్, బూత్ కమిటీ కోకన్వీనర్ మంద రాజేందర్, తోట రాజశేఖర్, ఉపాధ్యక్షులు రేండ్ల మహేశ్, గోపు ప్రవీణ్, కుంటయ్య, సంజీవ్, వంశీ, రమేశ్, పరశురాం తదితరులున్నారు.

రాజన్న ఆలయంలో నిత్యాన్నదానం

- మంత్రి పొన్నం ప్రభాకర్

మండపంలో మంత్రికి స్వామివారి ప్రసాదాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో

వేములవాడ/వేములవాడ టౌన్, ఆగస్టు 28: రాజన్న ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని వచ్చే కార్తీక మాసం నుంచి ప్రారంభిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ప్రతిరోజూ భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే ఇందుకు భవనాన్ని కూడా నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరుతామని చెప్పారు. అంతకుముందు వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామి వారిని మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు. అనంతరం అద్దాల మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేయగా, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి వారికి స్వామివారికి స్వామివారి శేషవస్త్రం కప్పి, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, కేడీసీసీబీ వైస్ చైర్మన్ పింగిలి రమేశ్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, సీఈవో సత్యనారాయణరావు, మేనేజర్ సాయికుమార్, బ్యాంకు డైరెక్టర్లు ఏనుగు తిరుపతిరెడ్డి, కిషన్‌రావు, స్వామిరెడ్డి, అల్వాల కోటి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మా ధవి, వైస్‌చైర్మన్ మహేశ్, సెస్ డైరెక్టర్ ఉమ, కౌన్సిలర్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి న్యాయవాదుల వినతి

మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వేములవాడ న్యాయవాదులు వినతి పత్రాన్ని అందజేశారు. వేములవాడకు వచ్చిన మంత్రికి కోర్టుకు సంబంధించిన పలు సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేసినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం తెలిపారు. ఇక్కడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, సీనియర్ న్యాయవాదులు నాగుల సత్యనారాయణ. నేరెళ్ల తిరుమల్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆవుదూత రజనీకాంత్, విద్యాసాగర్ రావు, గడ్డం సత్యనారాయణ రెడ్డి, ప్రశాంత్ కుమార్, నాగుల సంపత్ కుమార్, పంపరి శంకర్ ఉన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

కోనరావుపేట, ఆగస్టు 28: అధ్యాపకులు వృత్తిపై అంకితభావంతో పనిచేస్తూ, విద్యార్థుల భవిష్యత్తులో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. విద్యార్థులకు అధ్యాపకులు బోధిస్తున్న తీరును తరగతి గదుల్లోకి వెళ్లి పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఇక్కడ అధ్యాపకులు భూమేశ్ తదితరులున్నారు.

రాష్ట్రస్థాయికి విద్యార్థుల ఎంపిక

ముస్తాబాద్, ఆగస్టు 28: వికాస తరంగిణి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మండలంలోని ఆవునూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం మద్దికుంట లక్ష్మణ్ తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్ విభాగంలో పాక హారిక, బుప్రా మొదటి స్థానంలో నిలిచారన్నారు. సెప్టెంబర్ 2న హైదరాబాద్ ముచ్చింతల్‌లో రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వారధి పౌండేషన్ నిర్వహించిన వ్యాసరచన, డిబేట్ పోటీల్లో బుప్రా, దేవిక, నిఖిల్ సాయిలు ఎంపికయ్యారని, వీరు కూడా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

కొనసాగుతున్న వైద్య పరీక్షలు

రుద్రంగి, ఆగస్టు 28: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సిబ్బంది బుధవారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ, గ్రామంలో గ్రామస్తులు వైరల్ ఫీవర్‌తో బాధపడుతుండడంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేశారన్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, కాళ్లనొప్పులు, షుగర్, బీపీ తదిరత జబ్బులతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేశామన్నారు. ఇక్కడ ఎంఎల్‌హెచ్‌పీ అర్చన, సూపర్‌వైజర్లు దేవలక్ష్మి, గంగాధర్, ఏఎన్ఎం విజయ, లావణ్య, ఆశ కార్యకర్తలున్నారు.

లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శ్రావణ సందడి

రుద్రంగి, ఆగస్టు 28: శ్రావణ మాసం పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రహ్లాద గుట్టపై వెలిసిన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పూజార్లు స్వామి వారికి వేద మంత్రాలతో, పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారికి ఒడిబియ్యం సమర్పించుకున్నారు. ఇక్కడ ఆలయ కమిటీ చైర్మన్ కొమురె శంకర్, గ్రామ ప్రముఖులు, ఆలయకమిటీ సభ్యులు,పూజారులున్నారు.

రుద్రంగిలో పంటల పరిశీలన

రుద్రంగి, ఆగస్టు 28: మండల కేంద్రంలో మక్క, వరి, కూరగాయల పంటలను కరీంనగర్ జిల్లా ఏరువాక కేంద్రంలో ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు మదన్ మోహన్, రాజేంద్రప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వరిలో కాండం తొలుచు పురుగు, ఆకుముడత పురుగు, మక్కలో రసం పీల్చే పురుగు, మిరపలో తామర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి జ్యోతి, బీజేఆర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

వీర్నపల్లి, ఆగస్టు 28: మండలంలోని లాలసింగ్‌తండాలో జగదాంబ దేవి, సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు మూడు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. గిరిజన సంప్రదాయ పద్ధతిలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆలయంలో పూజలు చేశారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి, సేవాలాల్ చిత్రపటాన్ని అందించారు. వివిధ గ్రామాల నుంచి పెద్దఎత్తున గిరిజనులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

గంజాయి నిందితుడి రిమాండ్

ముస్తాబాద్, ఆగస్టు 28: గంజాయి కలిగి ఉన్న నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మొగిలి తెలిపారు. బుధవారం సిరిసిల్ల రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. వేములవాడ మండలం జయవరం గ్రామానికి చెందిన డప్పుల వంశీ ఇంటర్మీడియట్ చదువుతుండగా గంజాయికి అలవాటు పడ్డారని తెలిపారు. అనంతరం హైదరాబాద్‌లో సినిమాటోగ్రఫీ కోర్సు చేస్తుండగా గంజాయికి బానిసయ్యాడని పేర్కొన్నారు. కొన్నిరోజుల ఆనంతరం వేములవాడకు వచ్చి ప్రైవేటు జాబ్ చేసుకుంటూ గంజాయి అమ్మేవాడన్నారు. బుధవారం గంజాయి అమ్మడానికి ముస్తాబాద్ రాగా అదుపులోకి తీసుకొని తనిఖీ చేశామన్నారు. వంద గ్రాముల గంజాయి, స్కూటీ, సెల్‌ఫోన్ లభించిందన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ వివరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కోనరావుపేట, ఆగస్టు 28: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ఇటీవల మారు లక్ష్మారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానూభూతి తెలిపారు. ఇక్కడ నాయకులున్నారు.

కష్టపడితే ఉజ్వల భవిష్యత్తు

విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కౌన్సిలర్ రాజు, ఎంఈవో రఘుపతి

తెలంగాణ చౌక్, ఆగస్టు 28: విద్యార్థులు చిన్నప్పటి నుంచి కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కౌన్సిలర్ కల్లూరి రాజు అన్నారు. పట్టణంలోని వెంకంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గతేడాది 10 జీపీఏ సాధించిన అక్షయకు ట్యాబ్‌ను అందజేసి, మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం ఎంఈవో దూస రఘుపతి పదోతరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన ఆరుగురు అమ్మాయిలకు రూ.10 వేలు నగదు, మధు అనే ఎన్ఆర్ఐ రూ.2 వేలు అందజేశారు. ఈ ఏడాది కూడా 10 జీపీఏ సాధించిన ప్రతి ఒక్కరికీ ట్యాబ్‌లు అందజేస్తానని పేర్కొన్నారు. ఇక్కడ డీఎస్‌వో దేవయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్ పాసుల పంపిణీ

విద్యార్థులకు బస్‌పాసులు అందజేస్తున్న తిరుపతి

చందుర్తి, ఆగస్టు 28: ఎన్గల్ ప్రభుత్వ పాఠశాలలోని సుమారు 40 మంది విద్యార్థులకు బుధవారం గ్రామానికి చెందిన లాండె తిరుపతి ఉచితంగా బస్ పాసులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు తన వంతు సాయం అందించానని పేర్కొన్నారు. గ్రామస్తుల సహకారంతో రానున్న రోజుల్లో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఇక్కడ డిపో మేనేజర్ బోనాల శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీసీ సిబ్బంది రవీందర్, పురుషోత్తం, శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సత్తయ్య, గంటల తిరుపతి, ప్రణయ్ కుమార్, గడ్డం దేవయ్య ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట ప్రత్యేకాధికారిగా అఫ్జల్ బేగం

ఎల్లారెడ్డిపేటలో అఫ్జల్ బేగంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీడీవో సత్తయ్య

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 28: మండల స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా వ్యవసాధికారి అఫ్జల్ బేగం నియమించినట్లు ఎంపీడీవో సత్తయ్య తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పారిశుధ్యం, అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా చూడాలని స్పెషలాఫీసర్ అధికారులకు సూచించారు.

లైంగిక వేధింపులపై విద్యార్థినులకు అవగాహన

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 28: విద్యార్థినులకు లైంగిక వేధింపులు, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించామని తంగళ్లపల్లి ఎస్ఐ సుధాకర్ తెలిపారు. బుధవారం తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 'లైంగిక నేరాలు-పోక్సో చట్టాలు'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ సుధాకర్, మహిళా చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ పరమేశ్వర్ మాట్లాడుతూ, మహిళలపై ఎలాంటి నేరాలు జరిగినా పోలీసుశాఖ తక్షణమే స్పందిస్తుందని, అలాగే బాలబాలికల గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన ఉంటే లైంగిక నేరాలను పోలీసుల దృష్టికి తీసుకురావడం జరుగుతుందన్నారు. మహిళలపై ఎలాంటి నేరాలు జరిగినా 1098 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందివ్వాలని కోరారు. ఇక్కడ హెచ్ఎం ఉపేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

రుద్రంగి, ఆగస్టు 28: జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు బుధవారం బాలల లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, బాలల హక్కులు, పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయులు సమ్మిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, హెడ్ కానిస్టేబుల్ బాబురెడ్డి, ఐసీపీఎస్ విజయ్, చైల్డ్ లైన్ సూపర్‌వైజర్ సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట, ఆగస్టు 28 : పొత్తూరు వివేకానంద కాన్వెంట్‌లో విద్యార్థినులకు ఎస్ఐ కదిరె శ్రీకాత్ గౌడ్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండి మంచి విద్యను అభ్యసించాలన్నారు. మీ తో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, ఇబ్బందులకు గురి చేసినా 100, 1098కి డయల్ చేయాలన్నారు. లైంగిక వేధింపులకు గురిచేస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

వీర్నపల్లి, ఆగస్టు 28: మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, కేజీబీవీలో షీటీం సేవలపై కో ఆర్డినేటర్ పద్మ బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈవ్ టీజింగ్, వేధింపులకు గురయ్యే విద్యార్థినులు, మహిళలు ఆపద సమయంలో షీటీంను సంప్రదించాలన్నారు. మహిళల భద్రత కోసమే షీ టీంలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఇక్కడ ఎస్‌వో నీలిమా, ఉపాధ్యాయులున్నారు.

ఎల్ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి, ఆగస్టు 28: బోయినపల్లి మండలం మాన్వాడ శ్రీ రాజరాజేశ్వర జలాశయం నుంచి ఎల్ఎండీ జలాశయానికి 21,150 క్యూసెక్కుల నీటిని 5 గేట్ల ద్వారా నీటిని విడుదల చేసినట్లు జలాశయం ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రీ పంప్‌హౌస్ నుంచి వరద కాలువ ద్వారా శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి 10, 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు వారు తెలిపారు. ఈమేరకు జలాశయంలో 17.68 టీఎంసీల నీటి నిలువ ఉన్నట్లు తెలిపారు. జలాశయం సామర్థ్యం 27.54 టీఎంసీలకు 17.68 టీఎంసీల నీటి నిలువ ఉండగా ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు తెలిపారు.

రెండు గ్రామాల్లో రైతుల గుర్తింపు

బోయినపల్లి, ఆగస్టు 28: అనంతపల్లి, మల్కాపూర్ గ్రామాల్లో బుధవారం రేషన్ కార్డు లేకుండా రుణమాఫీ కాని రైతు కుటుంబాలను గుర్తించినట్లు ఏవో ప్రణీత తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అనంతపల్లి, మల్కాపూర్ గ్రామాల్లో వ్యవసాయ అధికారుల బృందం ఆ గ్రామాలకు వెళ్లి రేషన్ కార్డు లేని రైతు కుటుంబాలను గుర్తించి నివేదిక తయారు చేసినట్లు ఆమె చెప్పారు. అనంతపల్లిలో 23, మల్కాపూర్‌లో 18 మంది రేషన్ కార్డులు లేని రైతు కుటుంబాలు ఉన్నట్లు తెలిపారు.

బాలల హక్కులపై అవగాహన

బోయినపల్లి, ఆగస్టు 28: బాలల హక్కులపై బుధవారం స్తంభంపల్లి, జడ్పీ పాఠశాలల్లో విద్యార్థులకు ట్రాన్స్‌జెండర్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో విద్యార్థులకు బాలల హక్కులు పోక్సో చట్టం, మైనర్ వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాలల రక్ష భవన్ నుంచి ఎల్‌సీపీవో విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ నిర్మల ఉపాధ్యాయులు, హెచ్ఎంలున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 28: బాకుర్‌పల్లితండాకు చెందిన ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు అందించారు. ఇద్దరు లబ్ధిదారులకు రూ.26,500 మంజూరు కాగా సదరు చెక్కును పంపిణీ చేశారు. ఇక్కడ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అజ్మీరా రాజునాయక్, అజ్మీరా నందరాజ్, మోహన్‌నాయక్, భూక్యా ప్రకాశ్‌నాయక్ తదితరులున్నారు.

వేములవాడ రూరల్, ఆగస్టు 28: వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామానికి చెందిన ఉప్పుల లావణ్యకు మంజూరైన రూ.25 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసినట్లు కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు తీగల ఎల్లాగౌడ్, కిసాన్‌సెల్ అధ్యక్షుడు చెన్నాడి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇక్కడ సోషల్ మీడియా కన్వీనర్ ప్రభాకర్, రమేశ్, నర్సింహారెడ్డి, తీపిరెడ్డి రాంరెడ్డి పాల్గొన్నారు.

రుణమాఫీపై నేటి నుంచి సదస్సులు

చందుర్తి, ఆగస్టు 28: మండలంలో పంట రుణమాఫీ కానీ రైతుల కోసం ప్రత్యేక సదస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు చందుర్తి వ్యవసాయాధికారి దుర్గారాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం 2024 సంవత్సరంలో రెండు లక్షల్లోపు రుణమాఫీని ప్రకటించగా కొంతమంది రైతులకు రేషన్ కార్డుల పేర్లు లేకపోవడం, సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాకపోవడంతో ప్రత్యేక సదస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని రుణమాఫీ కానీ రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి తెలిపారు.

విద్యుత్ అంతరాయం

వీర్నపల్లి, ఆగస్టు 28: మండలంలోని అడవి పదిరలో 33/11కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతు పనులు చేస్తున్నందున విద్యుత్ అంతరాయం నెలకొంటుందని సెస్ ఏఈ పృథ్వీరాజ్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడవిపదిర, రంగంప